GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 329 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం : జులై-23-2024 | పేజీలు : 3

## ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

**టి మీడియా, జూలై 22, ఢిల్లీ :**



సంచలనం సృష్టించిన ఓటుకు నోటు సుప్రీంకోర్టులో విచారణ మరోసారి వాయిదా పడింది. జస్టిస్ బీఆర్ గవారు, కేవి. విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓటుకు నోటు కేసులో నిందితులైన రేవంత్ రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో కేసు ట్రయల్‌ని హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్-భోపాల్ మార్చాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై సుప్రీం నుంచి నోటీసులు అందుకున్న తెలంగాణ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి.. తాజాగా కౌంటర్ దాఖలు చేశారు. ఈ కౌంటర్‌ను ఇవాళ పరిశీలించిన కోర్టు.. రిజాయిండర్ దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు రెండు వారాల సమయం ఇచ్చింది.

# మూసీ నది ప్రక్షాళనకు సహకరించండి

### జంట జలాశయాలకు గోదావరి జలాల తరలింపునకూ నిధులివ్వండి

- కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

**టీ మీడియా, జులై 22,హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్‌ఫ్రంట్‌డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ గారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కోరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. కాలుష్య బారిన పడి మురికి కూపంగా మారిన మూసీని శుద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిన బృహత్తర ప్రణాళిక గురించి ఈ సందర్భంగా



సీఎం వివరించారు. రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆవశ్యతను వివరిస్తూ మూసీ మురికి నీటి శుద్ధి పనులకు రూ. 4 వేల కోట్లు, గోదావరి నదీ జలాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నింపే పనుల కోసం రూ. 6 వేల కోట్లు కేటాయించాలని కోరారు. జంట నగరాలకు సంబంధించి ఈ రెండు జలాశయాలను గోదావరి జలాలతో నింపితే హైదరాబాద్ నీటి కొరత తీరుతుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. జాతీయ స్థాయిలో జల్ జీవన్



మిషన్ 2019 లో ప్రారంభమైనప్పటికీ ఈ పథకం కింద తెలంగాణకు ఇంతవరకు నిధులు ఇవ్వలేదని గుర్తుచేస్తూ ఈ ఏడాది నుంచి నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణలో 7.85 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని ఇందుకోసం పీఎంఏవై (అర్బన్ మరియు రూరల్) కింద చేపట్టే నల్లా కనెక్షన్ల కోసం రూ. 16.100 కోట్ల వ్యయం అవుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

# పోలీసులపై జగన్ ఉగ్రరూపం

- గుర్తు పెట్టుకుంటా అంటూ వార్నింగ్

**టి మీడియా, జూలై 22, అమరావతి :**

ఏపీలో నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆరంభమయ్యాయి. అయిదు రోజుల పాటు కొనసాగనున్నాయి. పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టదలచుకోలేదు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలోని తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం. ఇప్పుడు కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ వైపే మొగ్గు చూపింది. మూడు నెలల కాలానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సభకు సమర్పిస్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చర్చించడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టుబట్టనుంది. ఇందులో భాగంగా వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీకి చెందిన ఇతర శాసనసభ, మండలి సభ్యులు.. నల్ల కండువాలను ధరించి ఉభయ సభల్లో ప్రదర్శించడానికి ప్లకార్డులతో అసెంబ్లీకి నేటి ఉదయం బయలు దేరారు.. అలాగే చంద్రబాబు- పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి నిరసనగా నినాదాలు చేశారు. దారిలోనే పోలీసులు- వైఎస్ జగన్ సహా మిగిలిన సభ్యులందరినీ అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. అసెంబ్లీ వైపు వెళ్లడానికి ప్రయత్నించిన జగన్‌ను పోలీసులు



అడ్డుకున్నారు. ఆ సమయంలో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులతో వాగ్యుద్ధం నెలకొంది. జగన్ సహా మిగిలిన వారిని పోలీసులు వెనక్కి నెట్టే ప్రయత్నానికి దిగడం వారిలో ఆగ్రహావేశాలకు కారణమైంది. దీంతో పోలీసుల తీరుపై జగన్ మండిపడ్డారు. తమ చేతుల్లో ఉన్న ప్లకార్డులను లాక్కుని, చించిపడేసే హక్కు, అధికారం ఎవరు ఇచ్చారంటూ నిలదీశారు జగన్. మధుసూదన్ రావ్ గుర్తు పెట్టుకో.. అంటూ తనను అడ్డుకున్న పోలీసు అధికారిని ఉద్దేశించి హెచ్చరించారాయన. ఎల్లకాలం ఇదే మాదిరిగా ఉండదు. ప్రజాస్వామ్యంలో ఉన్నాం మనం. నీ టోపీ మీద ఉన్న సింహాలకు అర్థం ఏమిటో తెలుసా?. అధికారంలో ఉన్నవాళ్లకు సెల్యూట్ కొట్టడం కాదు.. అంటూ జగన్ హితవు పలికారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పోలీసులు ఉన్నారని గుర్తు చేశారు.



## ఐదేళ్లలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం

- గవర్నర్ నజీర్ ప్రసంగం..

**టి మీడియా, జూలై 22,అమరావతి :**

ఏపీ అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం కొనసాగుతోంది. ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైసీపీ ఎమ్మెల్యేలు సభలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. నల్లకండువాలతో సభకు హాజరైన జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు.. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేస్తూ సభలో గందరగోళం సృష్టించారు. అయితే, వైసీపీ ఎమ్మెల్యేల నినాదాల మధ్యే గవర్నర్ అబ్దుల్ నజీర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. సందర్భంగా వైసిపి సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

అంతకు ముందు గవర్నర్ మాట్లాడుతూ.. "విభజనతో రాష్ట్రంలో లోటు బడ్జెట్ మిగిలింది. దీంతో రాష్ట్రం ఒడిదుడుకులకు లోనైంది. వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన చేసింది. ప్రతీకార రాజకీయాలు చేసింది. విభజన అశాస్త్రీయంగా జరిగింది. దీంతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. 2014-19 మధ్య రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయి. పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు చూడలేదు. 2019లో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్న సమయంలో అధికారం మారింది. గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులపై మూల ధన వ్యయం 56 శాతానికి పడిపోయింది." అని గవర్నర్ నజీర్ పేర్కొన్నారు.

# మరో మూడు రోజుల దంచుడే...

- కలెక్టర్లను అప్రమత్తం చేసిన సి.ఎస్

**టీ మీడియా, జులై 22,హైదరాబాద్, :**

రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించినందున అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. రాష్ట్రంలో గత వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం సమీక్షిస్తున్నారని, జిల్లాల్లో ఏవిధమైన ప్రాణ నష్టం తోపాటు ఆస్తి నష్టం కూడా కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందుగానే, పునరావాస కేంద్రాల ఏర్పాటు పై చర్యలు తీసుకోవాలని, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, తదితర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారుసచివాలయం నుంచి సిఎస్ నేడు జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫ రెన్స్ నిర్వహించారు.. డీజీపీ జితేందర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా లు కూడా ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల పలు చెరువులు, కుంటలు నిండాయని, అవి తెగకుండా తగు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికే, ముందస్తు జాగ్రత్తలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏదైనా అత్యవసర సహాయం కావాలన్నా తమను ఏ సమయంలో



నైనా సంప్రదించాలని జిల్లా కలెక్టర్లకు సి.ఎస్ సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, చెరువు కట్టలు తదితర ప్రాంతాల వద్ద జాగ్రత చర్యలు చేపట్టాలన్నారు. పారే వాగులను ఎవరూ దాటకుండా ఆయా ప్రాంతాలలో తగు బందో బస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, రాష్ట్రం లోని అందరు పోలీస్ కమీషనర్లు, ఎస్.పీ లు జిల్లా కలెక్టర్ తోపాటు ఇతర ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నారని తెలియచేసారు. ఇప్పటివరకు ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, పోలీస్ అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు ఒక మోస్తరు నుండి, భారీ వర్షాలతో పాటు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కురిసే అవకాశముందని తెలిపారు. భద్రాచలం వద్ద ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరిక ను ప్రకటించామని, 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నట్టు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అన్నారు. ఇప్పటికే జిల్లాల్లో దెబ్బతిన్న నివాస గృహాలు, ఇతర నష్టాలపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏవిధమైన అనుకోని సంఘటలు ఎదురైతే, ఎదుర్కోవడానికి ఎన్డీఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలియచేసారు. అన్ని మండలాలలో మండలాల వారీగా అధికారుల బృందాలను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉన్నామని ములుగు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా ఒక సమాచార అధికారిని గుర్తించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు. దాదాపు వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో ములుగు జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతం ఉందని, 77 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ముందస్తు జాగ్రత్తలను చేపట్టామని వివరించారు. జిల్లాల వారీగా వరదలు, వర్షాల ప్రభావం పై సి.ఎస్, ఆయా జిల్లాల కలెక్టర్ల, ఎస్పీలు, పోలీస్ కమిషనర్ల తో సమీక్షించారు. క్షేత్రస్థాయి అధికారులంతా తమతమ ప్రాంతాల్లో అందుబాటులో ఉండి పరిస్థితికనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని, వీలైనంత వేగంగా స్పందించాలని కోరారు. ఎలాంటి అలసత్యం దృష్టికి వచ్చిన తగు చర్యలుంటాయని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.



## వచ్చే ఐదేళ్లు దేశాభివృద్ధి కోసం పోరాడండి

- విపక్షాలకు ప్రధాని మోదీ సలహా

**టి మీడియా, జూలై 22, ఢిల్లీ :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు.. 2047 నాటికి విక్షిత్ భారత్ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. మూడోసారి అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్న మోదీ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. అమృతకాలంలో ఇదొక అద్భుతమైన బడ్జెట్ అన్నారు. కొన్ని పార్టీలు పార్లమెంట్ వేదికగా ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని మండిపడిన ప్రధాని.. వచ్చే ఐదేళ్లు దేశాభివృద్ధి కోసం పోరాడాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ విపక్షాలపై ఫైర్ అయ్యారు. కొన్ని పార్టీలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పార్లమెంటు సమయాన్ని ఉపయోగించుకున్నాయని, ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. గత సెషన్‌లో తనను మాట్లాడనివ్వకుండా చేయాలని ప్రతిపక్షాలు ప్రయత్నించాయని , ప్రజాస్వామ్యంలో అలాంటి ఎత్తుగడకు తావులేదన్నారు. పార్లమెంట్ తొలి సెషన్‌లోనే 140 కోట్ల మంది దేశ ప్రజల మెజారిటీతో ఎన్నికైన ప్రభుత్వం గొంతును నొక్కే ప్రయత్నం చేశారన్నారు.

# భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది

### ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన మంత్రి నిర్మలా సీతారామన్

**టి మీడియా, జూలై 22,న్యూఢిల్లీ :**



సోమవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం బిజెపి మిత్రపక్ష పార్టీల భాగస్వామ్యంతో ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో వరుసగా మూడోసారి మోడీ ప్రధాని అయ్యారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25 సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో రేపు (మంగళవారం) ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా బడ్జెట్‌కంటే ఒకరోజు ముందు సోమవారం 2023-24 ఆర్థికసర్వేను ఆమె సభలో ప్రవేశపెట్టారు. 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది' అని ఈ ఆర్థిక సర్వే తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థ కోవిడ్ అనంతరం పుంజుకునేందుకు విధాన రూపకర్తలు చేసిన ప్రయత్నం ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారిస్తుందని ఈ సర్వే పేర్కొంది. ప్రపంచ అస్థిరతల నడుమ 'అధిక వృద్ధి ఆకాంక్షలు కలిగిన దేశానికి 'మార్పు' మాత్రమే స్థిరంగా ఉంటుందని' ఈ సర్వే చెప్పింది. వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలకమైన ప్రపంచ సమస్యలపై ఒప్పందాలను చేరుకోవడం కష్టంగా మారింది. 2022 నుంచి ప్రయివేటు రంగం పెట్టుబడులు పెడుతున్నప్పటి నుంచి కొన్నేళ్లుగా ప్రభుత్వ పెట్టుబడులు మూలధనాన్ని కొనసాగించాయని ఈ సర్వే స్పష్టం చేసింది. ఇక గడచిన రెండు ంసవత్సరాలుగా 7.0 శాతం వృద్ధిరేటును నమోదు చేయగా.. 2024 ఆర్థిక సంవత్సరం అధికంగా 9.7 శాతం వృద్ధిరేటు నమోదయ్యే అవకాశం ఉందని ఈ సర్వే తెలిపింది. కొన్ని నిర్దిష్ట ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం రేటు పెరిగినప్పటికీ, ప్రధాన ద్రవ్యోల్బణం రేటు చాలావరకు నియంత్రణలో ఉంది. 2023 కంటే 2024లో వాణిజ్యలోటు తక్కువగా ఉంది. జిడిపిలో కరెంట్ ఖాతా లోటు దాదాపు 0.7 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులును నమోదు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఈ ఆర్థిక సర్వే పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఈ సర్వే సూచిస్తుంది. 2023-24 ఆర్థిక సర్వే ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం రూపొందించింది. ప్రధాన ఆర్థిక సలహాదారు పర్యవేక్షణలో ఈ సర్వేను రూపొందించారు. ఇక ఆర్థికమంత్రిగా నిర్మలాసీతారామన్ ఏడవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. గతంలో ఆర్థికమంత్రిగా ఉన్న మొరార్జీ దేశారు ఐదుసార్లు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా ఆయన రికార్డును నిర్మలాసీతారామన్ బద్దలుకొట్టనుంది.

# రుణమాఫీ ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో అర్థం కావడం లేదు

- మాజీ మంత్రి హరీశ్ రావు

**టి మీడియా, జూలై 22, హైదరాబాద్ :**

రాష్ట్రంలో సీరియస్ ఇషళ్యస్ ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు సొంత డబ్బులతో పనులు చేయించారు. ఇప్పుడు వారి బదిలీ జరిగింది.. లబోదిబోమంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సోమవారం మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు కేంద్ర నిధులు వచ్చినా మంజూరు చేయడం లేదు. పంచాయతీ ఎన్నికలు కాకపోవడంతో 750 కోట్లు కేంద్రం నిధులు ఆపింది. అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు అన్న చందంగా మారింది. ప్రతిపక్షం తట్టి లేపితే కానీ రాష్ట్ర ప్రభుత్వం మేల్కొవడం లేదని హరీశ్ రావు విమర్శించారు. కేంద్రం 800 కోట్లు ఉపాధి హామీ పథకానికి ఇచ్చింది.. రాష్ట్ర వాటా కలిపి విడుదల చేయాలి. ఆర్థిక సంఘం నిధులు 500 కోట్లు వచ్చినా ప్రభుత్వం విడుదల చేయడం లేదని హరీశ్ రావు అన్నారు. బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా జీతం లేదు. పంచాయతీ ఎన్నికలు పెట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ప్రభుత్వ హాస్టళ్ల లో పనిచేసే కింది సిబ్బందికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీతాలు ఇప్పటివరకు రాలేదు. అసెంబ్లీలో అవకాశం వస్తే అన్ని అంశాలపై ప్రభుత్వం దుమ్ము దులుపుతా. నాకు



అవకాశం వస్తే ఎనిమిది మంది మంత్రులు అడ్డుతగులుతున్నారని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో సమస్యలతో రోడ్డు ఎక్కని వర్గం లేదు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా విద్యుత్ సంక్షోభం తలెత్తుతుంది. విద్యుత్ వినియోగంలో పెద్దగా తేడా లేదు. విద్యుత్ స్టోర్ లలో మెటీరియల్ లేదు. ఉచిత కరెంట్ పథకానికి ఒక్క రూపాయి విడుదల కాలేదు. విద్యుత్ శాఖ ఆర్థికంగా దివాళాతీసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలకు కొన్నిచోట్ల కరెంట్ కట్ చేశారని హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 91లక్షల మంది తెల్ల రేషన్ కార్డు దారులకు గృహజ్యోతీ అమలు కావడం లేదు. వృధాప్య పెన్షన్లు సక్రమంగా అందడం లేదు. మే నెల పెన్షన్ ఇప్పటి వరకు అందలేదు. పెంచిన పెన్షన్ అటుంచి పాత పెన్షన్ ఇవ్వడం లేదు. విడో పెన్షన్లు ఎనిమిది నెలలుగా ఆగిపోయాయని హరీశ్ అన్నారు. రైతు రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధన అమలు చేస్తున్నారు. 30నుంచి 40శాతం మందికి రుణమాఫీ జరుగలేదు. కోతలు పెట్టడానికి నిబంధనలు వాడుతున్నారు. రుణమాఫీ ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి చిత్త శుద్ది ఉంటే కొత్త జీఓ తెచ్చి రైతులను రుణమాఫీ వర్తింప చేయాలి. రైతు, పాస్ బుక్ ఆధారంగా రుణమాఫీ ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో అగ్ని ప్రమాదం..

- కాలి బూడిదైన కీలక రికార్డులు
- విచారణకు సిఎం ఆదేశం



**టి మీడియా, జూలై 22,మదనపల్లె :**
మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కార్యాలయంలో చుక్కల భూములు, నిషేదిత భూములు రికార్డులుండే 22ఎ సెక్షన్ ఈ ప్రమాదం సభవించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున భూ కబ్జాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలకు ఊతమిచ్చే విధంగా ఈ ప్రమాదంలో కీలక రికార్డులు, డాక్యుమెంట్లు దగ్ధం కావడం గమనార్హం. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్ పి విద్యాసాగర్ నాయుడులు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. కీలకమైన తపాలా విభాగం, 22(%వా%) విభాగం లో రికార్డులు కాలి బూడిద కావడం, ఆదివారం అయినప్పటికీ 22(%వా%) విభాగంలో గౌతమ్ తేజ్ అనే అధికారి రాత్రి 11 గంటల వరకు కార్యాలయం లోనే ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వంలో ఈయనపైన అనేక ఆరోపణలు ఉన్నాయి. కాబట్టే ఉద్దేశ్య పూర్వకంగా అగ్నిప్రమాదం జరిగిందనే అనుమానాలు ఉన్నాయి. అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం చెయ్యాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

### విచారణకు సిఎం ఆదేశం

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంలో కీలక దస్త్రాలు కాలిపోయినట్లు సమాచారం. నూతన సబ్‌కలెక్టర్ బాధ్యతలు చేపట్టడానికి కొన్ని గంటల ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఏపి సిఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. అగ్నిప్రమాదమా? కుట్రపూరితమా? అనే అంశంపై విచారణకు సిఎం ఆదేశించారు. వెంటనే ఘటనాస్థలికి హెలికాప్టర్‌లో వెళ్లాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. కాసేపట్లో డీజీపీ, సీఐడీ చీఫ్ మదనపల్లెకు వెళ్లనున్నారు.

# పదోన్నతితో.... బాధ్యత పెరుగుదల

- రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్



**టీ మీడియా, జులై 22, గోదావరిఖని ప్రతినిధి:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్ఐగా పనిచేస్తూ ఎస్ఐగా పదోన్నతి పొందిన ఏడుగురు, హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తు ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన ఆరుగురు, కానిస్టేబుల్ గా పని చేస్తూ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతులు పొందిన 16 మంది సిబ్బందిని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ కార్యాలయంలో అభినందించి వారి వారి ర్యాంక్ ల వారిగా పదోన్నతి చిహ్నాంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసిపి ప్రతాప్, ఏఓ అశోక్ కుమార్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, మధు లు సూపరింటెంట్స్ ఇంద్రసేనారెడ్డి సందీప్, మనోజ్ కుమార్, సంధ్య,లు, సిసి గౌస్, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీల్లో ఈ ప్రభుత్వం రికార్డు సృష్టిస్తోంది

- రాహుల్, అఖిలేష్‌యాదవ్



**టి మీడియా, జూలై 22, న్యూఢిల్లీ :**
పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజే సభలో ప్రతిపక్ష ఎంపీలు నీట్ అంశంపై లేవనెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈరోజు ఉదయం సమావేశాలు ప్రారంభం కాగానే.. లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ నీట్ అంశంపై మాట్లాడడం మొదలుపెట్టారు. అయితే ఆయన్ని మాట్లడనీయకుండా ప్రతిపక్ష ఎంపీలు అడ్డుపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్-యుజి పరీక్షలో జరిగిన అవకతవకలపై సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. భారత పరీక్షా విధానం ఓ మోసమని ఆరోపించారు. ఇక ఇదే అంశంపై సమాజ్‌వాద్‌పార్టీ నేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. 'పేపర్ లీకేజీల్లో ఈ ప్రభుత్వం రికార్డు సృష్టిస్తోంది. కొన్ని సెంటర్లలో రెండు వేల మందికిపైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ మంత్రి (ధర్మేంద్ర ప్రదాన్‌ను ఉద్దేశిస్తూ..) ఉన్నంత వరకూ విద్యార్థులకు న్యాయం జరగదు' అని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు పరిష్కరించాలి

- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు



**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రజావాణి హాల్లో జడ్పి సి.ఈ.ఒ యాదయ్య తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రభుత్వ శాఖలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి ఆన్లైన్ లో జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. మొక్కలు నాటేందుకు మంచి వాతావరణం ఉన్నందున లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తల పై ఎప్పటికప్పుడు స్పందించి తగు చర్యలు తీసుకొని నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించారు. గరిష్ఠంగా మూడు రోజుల్లో నివేదిక పంపించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ రోజు మొత్తం (48) ప్రజావాణి ఫిర్యాదులు వచ్చాయి. నేటి ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, జిల్లా అధికారులు, వెబ్ ఎక్స్ ద్వారా తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కన్వరీ యాత్ర ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే



**టి మీడియా, జూలై 22, న్యూఢిల్లీ :**
కన్వరీ యాత్ర సందర్భంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. ఉత్తర భారతంలో శ్రావణమాసంలో ప్రారంభమయ్యే కన్వరీ యాత్రకు సంబంధించి యుపి ప్రభుత్వం కొన్ని ఆదేశాలను జారీ చేసింది. కన్వరీ యాత్ర మార్గంలో స్టాల్స్, హోటల్స్‌పై ఉన్న నేమ్‌ప్లేట్లపై యజమాని పేర్లు ప్రముఖంగా ఉండాలని, సిబ్బంది ఫోన్ నెంబర్లు ఉండాలని, ఆ మార్గంలో మాంసం అమ్మకాన్ని నిషేధించాలని యుపి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యుపి తర్వాత ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కూడా స్టాల్స్, హోటల్స్ నేమ్‌ప్లేట్లపై యజమాని పేర్లను వేయించాలని ఆదేశాలు జారీ చేశాయి. ఈ ఆదేశాలపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈ మూడు రాష్ట్రాలు ఇచ్చిన నిర్దేశాలపై కోర్టు స్టే విధించింది. ఈ ఆదేశాలపై తగిన సమాధానం ఇవ్వాలంటూ ఆ మూడు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేయింది. ఆహార పదార్థాలను అమ్ముకునే వ్యాపారులు నేమ్ ప్లేట్లపై పేర్లను వేయించాలని బలవంతపెట్టడం సబబు కాదని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.



## కౌలు రైతులకు అవగాహన సదస్సు

**టీ మీడియా, జూలై 22, మహానంది:**
మహానంది మండలం బుక్కాపురం, గాజులపల్లె గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కౌలు రైతుల అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలుకు తీసుకున్న ప్రతి రైతు సి సి ఆర్ సి పత్రాలను తీసుకోవాలని తెలియజేశారు. కౌలు రైతు బ్యాంకు నుండి రుణం పొందుటకు, పంట నష్టపరిహారం, పంటల బీమా, కనీస మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం వారు చేసే పంట కొనుగోళ్లకు ఈ పత్రం ఉపయోగపడుతుందన్నారు. భూ యజమాని సాగుదారు హక్కు పత్రం పైన సంతకం పెట్టడం వలన, అతని భూహక్కులకు ఎటువంటి భంగం కలగదని, కౌలు తీసుకున్న రైతుకు పంటపైన మాత్రమే హక్కు ఉంటుందని,భూమిపైన ఎటువంటి హక్కు ఉండదని తెలిపారు.కౌలు కార్డు ఆధారంగా, కౌలు రైతు పేరు మీదనే పంట నమోదు చేస్తామని,ఈ పంట సాగుదారు హక్కు పత్రము కాలపరిమితి 11 నెలలు ఉంటుందని, దరఖాస్తు చేసుకొనుటకు మీ గ్రామ రెవెన్యూ అధికారిని లేదా గ్రామ వ్యవసాయ అధికారిని వెంటనే కలవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటరాముడు, చంద్రమోహన్, క్రిస్టియానమ్మ, ఏ ఈ ఓ శ్రీనివాసరెడ్డి, విహెచ్‌ఏలు పల్లవి, మౌనిక, వి ఎ ఎ శైనీ రైతులు పాల్గొన్నారు.



## మహిళా మోర్చా జిల్లా కమిటీ ఎంపిక

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా బిజెపి కార్యాలయంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సమక్షంలో మహిళా మోర్చా జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ మాట్లాడుతూ జిల్లా కమిటీలో ఎన్నుకోబడిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక నమస్సులు తెలియజేస్తూ రేపు రాబోవు రోజుల్లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసే మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని గెలిపించుకోవాలని వారు అన్నారు. అశ్విని రాధజిల్లా అధ్యక్షురాలు,టీ. అర్చన, ఉపధ్యక్షురాలుసూగూరు లక్ష్మి,ప్రధాన కార్యదర్శిజీ. కవిత యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శిటీ. అరుణ,జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణమ్మ,జిల్లాకార్యవర్గసభ్యురాలుమహేశ్వరి,జిల్లా కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి,జిల్లా కార్యదర్శి బండి పుష్పజిల్లా కార్యదర్శిజీ. సరోజ యాదవ్జిల్లా అధికార ప్రతినిధిజిల్లా కోశాధికారి జిల్లా సభ్యురాలు జ్యోతిజిల్లా సభ్యురాలు మంగమ్మ జిల్లా సభ్యురాలు లక్ష్మి నరసమ్మ జిల్లా సభ్యురాలు పద్య జిల్లా సభ్యురాల కే. విమల జిల్లా కార్యదర్శి సత్యమ్మ రజక జిల్లా సభ్యురాలు,బలిజ పావని,జిల్లా సభ్యురాలుజ్యోతి,జిల్లా సభ్యురాలు కే. సుశీల జిల్లా సభ్యురాలు పార్టీ చేసే ప్రతి ఒక్క అభివృద్ధి కార్యక్రమంలో పాలుపంచుకొని బిజెపి పార్టీకి న్యాయం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షులు డి. నారాయణ, మాజీ కౌన్సిలర్ వనపర్తి పట్టణ బిజెపి అధ్యక్షుడు బచ్చు రాము, వనపర్తిజిల్లాబిజెపిఉపాధ్యక్షులు ఏ సీతారాములు, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ, పెద్దిరాజు, రాయన్న, పీఎం రాము, బక్క శీను, మహిళ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు వారణాసి కల్పన, సుగురు లక్ష్మి ,కవిత, అరుణ, విమల, పద్మ ,బిజెపి మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.



## సింగిరెడ్డి.తారకమ్మ కి బిఆర్ఎస్ ఘన నివాళులు

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
సింగిరెడ్డి. తారకమ్మ 5వ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తల్లికి కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఇంటిలో ఆమె చిత్రపటాన్నికి బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో గట్టు యాదవ్,వాకిటి.శ్రీధర్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల. అశోక్, మాణిక్యం, నాగన్న యాదవ్, ఉంగ్లం. తిరుమల్,స్టార్.రహీమ్,గౌడ నాయక్, యుగంధర్ రెడ్డి, జోహెబ్ హుస్సేన్,మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము,హమాలీ వెంకటేష్,రామస్వామి, తోట.శ్రీను, రాజు, నందిమల్ల.రాములు పాల్గొన్నారు.



# దళారి వ్యవస్థను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే

- కాంగ్రెస్ నాయకుల ద్వారా చెక్కులను ఇప్పించడం విడ్డూరం
- బీఆర్ఎస్ నాయకులు

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
దళారులను నమ్మొద్దు, దళారీ వ్యవస్థను నిర్మూలించాలి అంటూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి దళారి వ్యవస్థను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సోమవారం పట్టణ బీఆర్ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో మంజూరు అయిన సిఎం రిలీఫ్ ఫండ్స్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే 19వ తారీఖు రోజు కొంత మంది లబ్దిదారులకు పంపిణీ చేసి మిగతా చెక్కులను కాంగ్రెస్ నాయకుల ద్వారా ఇప్పించడం విడ్డూరంగా ఉందని మాజీ కౌన్సిలర్ ఉంగ్లమ్. తిరుమల్ విమర్శించారు. గతంలో నిరంజన్ రెడ్డి సి.ఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా తెలియజేసి వారికి భోజనం పెట్టి అందజేసేవారని అన్నారు. ఎమ్మెల్యే మేగారెడ్డి కొంత మందికి అందించి మిగతా చెక్కులు కాంగ్రెస్ నాయకులకు ఇచ్చి పంపణి చేయించడం అంటే దళారి వ్యవస్థను ప్రోత్సహించడం అవుతుందని మరి అవినీతికి ఆస్కారం ఉంటుంది అని ఆరోపించారు. ఇప్పటి వరకు గత ప్రభుత్వం ద్వారా వచ్చిన 119 సి.ఎం.రిలీఫ్ ఫండ్స్,200 పైగా కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేయడం తప్ప వారు కొత్తగా మంజూరు చేయించలేదని వారు ఇచ్చిన హామీ ప్రకారం కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారు అందజేయాలని డిమాండ్ చేశారు.నిరంజన్ రెడ్డి హయాంలో మంజూరు కావలసిన చెక్కులు ఇంకా 1000 వరకు వుంటాయని వాటిని నేరుగా పోస్ట్ ద్వారా లబ్దిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గట్టు యాదవ్, నందిమల్ల.అశోక్, నాగన్న యాదవ్, ఎద్దుల.సాయికుమార్,స్టార్.రహీమ్,మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

# భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు.ఫిర్యాదుదారుల నుండి సమస్యలను తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను తీర్చేందుకు ధరణిలో అర్‌ఓఅర్ చట్టం ను తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు బాధితులు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందిస్తూ ఆయన ఆయా డిపార్ట్మెంట్ అధికారులకు ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు.



## ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్స

**టీ మీడియా, జులై 22, గోదావరిఖని ప్రతినిధి:**
పాలకుర్తి మండలం బసంత నగర్ లో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. గత 15 రోజుల నుండి హైదరాబాదు నుండి ప్రత్యేక వైద్యుల బృందం చే అత్యాధునిక సాంకేతిక పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు సుమారు 100 మందికి నిర్వహించారు. అందులో 49 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉందని గుర్తించి వారిని హైదరాబాదులోని శంకర్ విజన్ సెంటర్ కి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్స చేయించడం జరుగుతుందని, రెండు మూడు రోజులు ఉచిత భోజనం, వసతులతో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి తిరిగి ఉచిత బస్సులో బసంత్ నగర్ కి వారి గమ్యాలకు చేరుస్తామని, ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి బాధ్యులు పరికిపండ్ల రామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సభ్యులు రమేష్ బాబు, రాజేందర్, నాగార్జున, వెంకటేష్, రమేష్, భార్గవ్ పాల్గొన్నారు.

## విద్యుత్తు సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి డిఈ కార్యాలయంలో ఆయన అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వనపర్తి నియోజకవర్గంలో విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారానికి కొత్తగా ఏర్పాటు చేయవలసిన విద్యుత్ ఉప కేంద్రాలు, నియంత్రికలు, విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అధికారులు అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరాను అందించాలని, నియంత్రికల వద్ద వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, సత్య శీలా రెడ్డి వనపర్తి అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కొత్తకోట ఏడీ శివశంకర్ రెడ్డి, వనపర్తి ఏడీ వేణు వనపర్తి ఏఈ రాజయ్య గౌడ్, ఖిల్లా ఘనపురం ఏఈ కొండయ్య, వనపర్తి మండల ఏఈ శ్రీనివాసులు, పెద్దమందడి మండల ఏఈ శ్రీకాంత్, గోపాల్పేట ఏఈ హర్షవర్ధన్ రెడ్డి,పెబ్బేరు ఏఈ అభిలాష్, శ్రీరంగపురం ఏఈ సుఖేష్, పాల్గొన్నారు.

## ఎస్సై నాగేంద్రప్రసాద్ ని సన్మానించిన గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు



**టీ మీడియా, జూలై 22, మహానంది:**
మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ఈనెల 20వ తేదీన శుక్రవారం మౌలాలి స్వామి జార్తుల వేడుకలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. సోమవారం మౌలాలి స్వామి దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మహానంది పోలీస్ స్టేషన్లో ఎస్సై నాగేంద్ర ప్రసాద్ ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మౌలాలి స్వామివారి ప్రసాదాలు అందజేసి, ఆయనను అభినందించారు.ఈ కార్యక్రమంలో గజ్జ పెద్ద రామసుబ్బయ్య, రామ నాయుడు, టపా ఎర్ర మద్దిలేటి, నాగన్న, బజార్ ,బాలుడు, దస్తగిరి, పుల్లయ్య, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహానందిలో హుండీ లెక్కింపు

- ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి..



**టీ మీడియా, జూలై 22, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో మంగళవారం ఉదయం దేవస్థాన హుండీ లెక్కించనున్నట్లు ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఈవో మాట్లాడుతూ... స్థానిక అభిషేక మండపంలో ఉదయం 7 గంటల నుంచి, ఉభయ దేవాలయముల హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,అర్చకులు, ఏజెన్సీ వర్కర్స్, తదితరులు పాల్గొనాలని తెలిపారు.

## కళాశాలలను పరిశీలించిన జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి లోని డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కాలేజీలను పరిశీలించిన జిల్లెల చిన్నారెడ్డి. సోమవారం వనపర్తి లోని డిగ్రీ,పీజీ, ఇంజనీరింగ్ కాలేజ్ లను పరిశీలించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్, విద్యార్థులు మాట్లాడుతూ నూతన హాస్టల్ భవనం మంజూరు చేయాలని కోరడం జరిగింది. పీజీ కాలేజ్ అధికారులు, విద్యార్థులతో మాట్లాడినప్పుడు వారు నూతన హాస్టల్ భవనం, ల్యాబ్స్, ఫ్యాకల్టీ, తెలుగు కోర్సు మంజూరు చేయాలని కోరడం జరిగింది. ఇంజనీరింగ్ కాలేజీ అధికారులు విద్యార్థులు నూతన ఇంజనీరింగ్ కాలేజ్ భవనాన్ని త్వరగా పూర్తిచేసి మాకు కేటాయించాలని కోరడం జరిగింది. ఇప్పుడు ఉన్న కాలేజీకి మట్టి రోడ్డు ఉంది కొత్త రోడ్డు ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన హాస్టల్ భవనాలను, ఫ్యాకల్టీ, నూతన ఇంజనీరింగ్ భవనాన్ని, రోడ్డు,బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని తెలియజేయడం జరిగింది. చిన్నారెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ రెండు రోజుల్లో బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, దాసరాజుల భాస్కర్, సహదేవుడు, కృపాకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గడ్డం వినోద్,మిద్దె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నూరు రవీందర్


**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
బిజెపి వనపర్తి మండల కార్యవర్గ సమావేశం బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నూరు రవీందర్ ముఖ్యఅతిథిగా మండల అధ్యక్షులు సంద వెంకటేష్ అధ్యక్షతన లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మున్నూరు రవీందర్ మాట్లాడుతూ రెండు మాసాల క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్ లో ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపకు గడపకు చేరవేసి క్రియాశీలకంగా పనిచేయడం కారణంగానే ప్రతి పోలింగ్ బూత్ లో మన అభ్యర్థి భరత్ ప్రసాద్ కు పెద్ద ఎత్తున ఓటు వేశారని ఓటమికి కృంగిపోకుండా పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఓట్లను సంకల్పంగా తీసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీలు పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏది అమలుకు నోచుకోలేదని ప్రతి మహిళకు నెలకు 2500/- ప్రతి ఎకరానికి రైతు భరోసా 15000/- కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపు రైతు కూలీలకు ఏటా 12,500/-, 4000/- నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్లు 4000/- ప్రతి విద్యార్థినికి ఉచిత స్కూటీ, 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ జూన్ నెలలో రైతులకు ఇయాల్సిన పెట్టుబడి సాయం 12,500/- రైతు భరోసా డబ్బులు రుణమాఫీ చేశామంటూ కాంగ్రెస్ గొప్పలు చెప్పుకుంటుందని వారం రోజుల్లో రైతు భరోసాను విడుదల చేసి కాంగ్రెస్ నిజాయితీని నిరూపించుకోవాలని, పార్టీ పై ప్రభుత్వం పై పట్టు లేని రేవంత్ రెడ్డి కాంట్రాక్టర్లు, పారిశ్రామికవర్గాల నుండి 10% కమిషన్లు వసూలు చేస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల్లో పనిచేసిన బూత్ కమిటీ అధ్యక్షులను శక్తి కేంద్ర ఇన్చార్జులు మండల నాయకులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వాకిటి సుదర్శన్, ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ గౌడ్, పి రాజేందర్, యువ మోర్చా అధ్యక్షులు వెంకటేష్ నాయక్, నాయకులు అంజి, చిన్నయ్య యాదవ్, మంద సోమన్న, బూత్ కమిటీ అధ్యక్షులు రంజిత్, కరుణాకర్, రాము, అంజి, శివ, వెంకటేష్, విష్ణు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇక పద్మశ్రీ గ్రహీతలకు పింఛన్..

- ఉత్తర్వులు జారీ

**టీ మీడియా,జులై 22,హైదరాబాద్ :**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు! పద్మశ్రీ అవార్డులు ప్రకటంచగానే శిల్పరామం లో ఘనంగా సత్కరించిన విషయం విదితమే! ఇటీవలే పద్మశ్రీ గ్రహీతలకు ఒక్కొక్కరికి 25 లక్షలు నజరానా అందించగా, ప్రతి నెలా 25 వేల రూపాయలు పింఛనుకు సంబంధించి ఇవాళ జివో విడుదల చేశారు. ఇక నుంచి ప్రతి నెల 25 వేల రూపాయల గౌరవ పెన్షన్ అందుతుందని సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

కనుమరుగవుతున్న కళలను గుర్తించి, వాటిని భవిష్యత్తు తరాలకు అందించే కళాకారులను ప్రోత్సహించేందుకు సీయం రేంవత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అందులో భాగంగా ఇటీవలే పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప తదితరులకు ప్రతీ నెల25 వేల రూపాయల ప్రత్యేక పింఛన్ మంజూరు చేస్తూ జీవో జారీ చేసినట్లు వివరించారు. ఇక నుంచి సాంస్కృతిక శాఖ ద్వారా పింఛన్ డబ్బులు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతాయి.



# రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
రైతుబీమా కోసం 2024 జూన్ 28 నాటికి రిజిస్ట్రేషన్ అయిన వారి జాబితా ధరణి పోర్టల్ నుంచి వ్యవసాయ శాఖకు అందిన రైతు సోదరులందరూ 18-59 సం.లు ఉన్న వారు ఆగస్టు 4 లోపు మీ సమీప రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి రైతు బీమాకు స్వయంగా దరఖాస్తుదారుడు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి రైతుబీమా దరఖాస్తు ఫారానికి పట్టా పాసుబుక్, ఆధార్,నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలతో రైతులు ఏఈఓ ను సంప్రదించి అర్హత కలిగినా రైతు సోదరులందరూ దరఖాస్తు చేసుకోవాలి.







## తారకమ్మకు ఘన నివాళులు

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
సింగిరెడ్డి. తారకమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో సింగిరెడ్డి. తారకమ్మ చిత్ర పటానికి బీఆర్ఎస్ యువజన నాయకులు వజ్రాల రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



## నివాళులు అర్పించిన జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణం లక్ష్మి నరసింహ కాలనీ కి చెందిన మోహన్ రాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



## లాడ్జిలను తనిఖీ చేసిన ఎస్ఐ

**టీ మీడియా, జూలై 22, మహానంది:**
మహానందిలోని పలు లాడ్జిలను ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి, రిసెప్షన్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాడ్జిలలో బస చేసిన వ్యక్తుల వివారాలను పరిశీలించి, కొత్త వ్యక్తులను ప్రశ్నిస్తూ, వివరాలపై ఆరా తీశామని, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటుమన్నారు. అనంతరం మహానంది పోలీస్ స్టేషన్లో లాడ్జి నిర్వాహకులతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడుతూ.. లాడ్జీల్లో బస చేసే వ్యక్తుల నుంచి ఆధార్ కార్డులు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని, నిర్వహకులకు ఎస్సై నాగేంద్రప్రసాద్ సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వరాదని, లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సి.సి.కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిల్లో బస చేసిన సమయంలో, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లాడ్జిల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చినా, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ హెచ్చరించారు.

## ఆర్థిక సహాయం అందజేత

**టీ మీడీయా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని 23 వ వార్డులో ముద్దంగుల నరసింహ మృతి చెందారు. ఈ విషయం తెలుసు కున్న మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుబ్బిరెడ్డి యుగంధర్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. మీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు.





## మహిళల భద్రత రక్షణకై షీ టీమ్స్ : ఎస్సై అంజద్

**టీ మీడియా, జులై 22, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి కొత్త బస్టాండ్ ఆవరణలో షీ టీం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం టీమ్, ఎస్సై అంజద్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలికల, విద్యార్థిని విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ తరపున షీ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు షీ టీం ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని లేదా 63039 23211 వాట్సప్ ద్వారా కూడా పిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. సైబర్ నేరాలపై మోసపోయిన వ్యక్తులు 1930కు ఫిర్యాదు చేయాలి అని చెప్పారు జిల్లా పరిధిలో పాఠశాలలు/కళాశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు ఇద్దరి చొప్పున విద్యార్థినులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్,ఆకతాయిల వేధింపులను అరికట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు బాలికలు విద్యార్థిని విద్యార్థులు వెంటనే జిల్లా షీ టీం ఫోన్ నెంబర్ 63039 23211 కి కాల్ చేసిన కాని, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి వెంటనే షీ టీమ్స్ సహాయం పొదలని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో షీ టీం ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కానిస్టేబుల్ కృష్ణయ్య బస్టాండ్ నందు గల ప్రజలు, విద్యార్థిని , విద్యార్థులు పాల్గొన్నారు.

## అనాధకి అంత్యక్రియలు

**టీ మీడియా, జులై 22, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి ఎక్స్ రోడ్ వద్ద మహారాష్ట్రకు చెందిన వృద్ధురాలు మరణించారు. ఈ సంఘటన సోమవారం తెలుసుకున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లె రాజు వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చి అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పనసా రాజు,పారుపల్లి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## కారుణ్య ఉద్యోగ పత్రాలు అందజేసిన జీఎం

**టీ మీడియా, జులై 22, గోదావరిఖని ప్రతినిధి:**
సింగరేణి ఆర్జీ-1 పరిధిలో సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేసి మెడికల్ ఇన్వాలిడేషన్, చనిపోయిన వారి కుటుంబాల్లో నలుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ ఉత్తర్వులను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సిఅండ్ఎం బలరాం ఆదేశాల మేరకు త్వరిగతిన కారుణ్య నియామకాలను పూర్తి చేశామని తెలిపారు. సింగరేణి మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారిని వెనువెంటనే అన్ ఫిట్ చేసి కుటుంబ సభ్యులలో డిపెండెంట్ కింద ఉద్యోగాలను అందించామని తెలిపారు. ఈ ఉద్యోగ నియమాకాల్లో ముగ్గురు మహిళలకు, ఒక పురుష అభ్యర్థులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. త్వరలోనే వీరికి ఉద్యోగ ప్లేస్ ను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగస్తులు సింగరేణి భవిష్యత్తు కోసం పాటుపడాలని, విధుల్లో నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని, సింగరేణి అభివృద్ధి కోసమే పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ సిహెచ్ లక్ష్మీనారాయణ, సి ఎం ఓ ఏ ఐ అధికార ప్రతినిధి శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ జిఎం ఆఫీస్ ఇంచార్జ్ రాజు, ఏరియా సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి ఉగ్రరూపం దృశ్యాలు







